క్లుప్తంగా

హుండీ ఆదాయం లెక్కింపు



పలమనేరు: స్థానిక సత్యగంగమ్మ ఆలయానికి హుండీ ఆదాయం రూ.1.18లక్షలు లభించిందని ఎండోమెంట్ అధికారి కమలాకర్ తెలిపారు. గురువారం హుండీ ఆదాయాన్ని భక్తుల సమక్షంలో లెక్కించారు.

వసనాడు విద్యార్థినికి బంగారు పతకం



బంగారు పతకం సాధించిన అర్చనతో ఉపాధ్యాయులు

కుప్పం రూరల్: జిల్లాస్థాయి 'నిడ్జామ్' పోటీల్లో కుప్పం మండలం వసనాడు ఉన్నత పాఠశాల విద్యార్థిని హైజంప్‌లో బంగారు పతకం సాధించిందని ఆ స్కూలు ప్రధానోపాధ్యాయులు వెంకట రమణనాయక్ చెప్పారు. బుధవారం తిరుపతిలో జరిగిన నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్‌లో అండర్ -16 విభాగంలో తమ స్కూలు విద్యార్థిని వి.అర్చన బంగారు పతకం సాధించినట్లు చెప్పారు. అర్చనతోపాటు ఆమెకు శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయుడు వెంకటేష్‌ను ఉపాధ్యాయ బృందం గురువారం అభినందించింది.

మినీ మార్కెట్ యార్డులో సర్వే



మార్కెట్ యార్డు స్థలాన్ని సర్వే చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వి.కోట: మండలంలోని శివునికుప్పంలో మినీ మార్కెట్ యార్డు ఏర్పాటు పనులను గురువారం మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, డీఈఈ (చిత్తూరు) సిబ్బందితో కలిసి పరిశీలించారు. ప్రభుత్వం మినీ మార్కెట్ కోసం మంజూరైన 7.09 ఎకరాల స్థలాన్ని స్థానిక సర్వేయర్లతో సర్వే చేసిన అనంతరం అధికారులు మాట్లాడారు. స్థలాన్ని లీజుకు ఇవ్వడం కోసం మార్కింగ్ ప్రక్రియ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ ఉపాధ్యక్షులు పుష్పలత, ఆంజనేయులు, పాలకవర్గ సభ్యులు వేణుగోపాల్, నారాయణరెడ్డి, సుబ్రమణ్యం, కార్యదర్శి సంజీవకుమార్, శంకర్‌రెడ్డి, లోకేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మండల ఎస్టీయూ కార్యవర్గం ఎంపిక





లక్ష్మీనారాయణ, భాస్కర్

పలమనేరు: మండల ఎస్టీయూ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆ సంఘ రాష్ట్ర నాయకులు గంటా మోహన్ అధ్యక్షతన గురువారం స్థానిక నార్త్ పాఠశాలలో ఏకగ్రీవంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా భాస్కర్, కోశాధికారిగా వెంకటప్ప, గౌరవాధ్యక్షుడిగా రజాక్‌తోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

కురబల కల సాకారం

- 4 దశాబ్దాల నిరీక్షణకు జగనన్న పాలనలో తెర
- కురబల అభ్యున్నతిని విస్మరించిన చంద్రబాబు
- కనకదాను విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే వెంకటేగౌడ



విగ్రహావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, కురబ నాయకులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: మండల కురబ కులస్తుల చిరకాల కోర్కెలను గత టీడీపీ ప్రభుత్వం సాకారం చేయలేదని, రాష్ట్రంలో లక్షలాది కురబల అభ్యున్నతిని చంద్రబాబునాయుడు విస్మరించారని ఎమ్మెల్యే వెంకటేగౌడ విమర్శించారు. తన దృష్టికి వచ్చిన వెంటనే కురబల సమస్యలను పరిష్కరించానని ఆయన చెప్పారు. గురువారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ద్వైత వేదాంత తత్వవేత్త శ్రీ దాసశ్రేష్ఠ కనకదాసు క్యాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే వెంకటేగౌడ, రాష్ట్ర కురుబ సంఘం అధ్యక్షుడు జబ్బుల శ్రీనివాసులు, మండల కురుబ సంఘ సభ్యులతో కలసి ఆవిష్కరించారు. కనకదాసు విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం కురబ కులస్తుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. భక్త కనకదాసు విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని గత పాలకులకు ఎన్నోసార్లు మండల కురబ కులస్తులు విన్నవించినా అప్పటి పాలకులు స్పందించిన పాపానపోలేదన్నారు. ప్రస్తుతం తమ దృష్టికి వారు తీసుకురావడంతో ఆలస్యం చేయకుండా విగ్రహం ఏర్పాటుకు తమ వంతు సహకారం అందించామన్నారు. దీంతో కురబల 4 దశాబ్దాల కలను ప్రభుత్వం సాకారం చేసిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెనుకబడిన కులాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ భక్త కనకదాసు జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పార్టీలకతీతంగా పాలన కొనసాగిస్తున్న జగనన్నను అందరూ మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. జగనన్న ప్రభుత్వంలో తమ కోర్కెలు తీరుతున్నాయని కురబ కులస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, కురబ సంఘ మండల అధ్యక్షుడు బాలు, నాయకులు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అభివృద్ధికే పెద్దపీట

- రూ.3.62 కోట్లతో పట్టణంలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు
- వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు
- అజెండాలోని అన్ని అంశాలకు కౌన్సిల్ ఆమోదం
- మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ చాముండేశ్వరి

పలమనేరు: పలమనేరు మున్సిపల్ అభివృద్ధే లక్ష్యంగా తమ పాలకవర్గం పని చేస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి స్పష్టం చేశారు. గురువారం మున్సిపల్ అత్యవసర సమావేశం స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో నిర్వహించారు. అధ్యక్షత వహించి చైర్‌పర్సన్ మాట్లాడారు. పట్టణంలో జీజీఎంపీ(హైఇంపాక్ట్ పనులు) భాగంగా పలు చోట్ల సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి రూ.3.62 కోట్లను వెచ్చించనున్నట్టు తెలిపారు, చెత్తను తొలగించే కంపాక్టర్ వాహనాల మరమ్మతులు, ఎల్ఈడీ బల్బుల నిర్వహణ, పోలింగ్ బూత్‌లో కనీస సౌకర్యాలు మొదలైన పనులు చేస్తామన్నారు. ప్రస్తుతం పట్టణానికి రోజూ 3.83 ఎంఎల్ నీటిని సరఫరా చేస్తున్నామని, వేసవిలో తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా నీటి ట్యాంకర్లను ఏ ర్పాటు చేస్తామన్నారు. కౌన్సిల్ సహకారంతో పట్టణంలో ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తామని తెలిపారు. అనంతరం అజెండాలోని అన్ని అంశాలకు పాలకవర్గం ఆమోదం తెలిపింది.

అధికారుల దృష్టికి సమస్యలు

పట్టణంలోని పలు హోటళ్లలో నాణ్యత లేని భోజనం ఉంటోందని, దీనిపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు చేయాలని, దోమలు ఎక్కువగా ఉండడంతో ఫాగింగ్ చేయాలని కౌన్సిలర్ కిరణ్ కోరారు.. స్థానిక ఫిల్టర్‌హౌస్‌లో అవసరమైన మరమ్మతులు చేయాలని మరో కౌన్సిలర్ హైదర్ కోరారు. గుడియాత్తం రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, అంబేడ్కర్ సర్కిల్లో డ్రైనేజీల సమస్యలను కౌన్సిలర్ శ్యామ్‌సుందర్ రాజు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వేసవిలో పట్టణానికి నీటి సమస్యను అధిగమించడానికి హంద్రీ-నీవా జలాలను పైపులైను ద్వారా పట్టణానికి తరలిస్తే నీటి సమస్య తీరుతుందని టీడీపీ కౌన్సిలర్ శారద అన్నారు. దీనిపై తగు చర్యలను తీసుకుంటామని కమిషనర్ కిరణ్‌కుమార్ స్పందించారు. సమావేశంలో మున్సిపల్ వివిధ విభాగాల అధికారులు, మున్సిపల్ వైస్ చైర్మన్లు గుల్జార్, రవి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటింటా దుర్గ ప్రచారం



పసుపు,కుంకుమ అందజేస్తున్న దుర్గ

రామకుప్పం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ అన్నారు. గురువారం మండలంలోని కొంగనపల్లె పంచాయతీలోని గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి మహిళలకు పసుపు, కుంకుమ, చీర ఇచ్చారు. సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే భరత్ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యలను పరిష్కరిస్తున్నారని, కుప్పం నియోజకవర్గం అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తున్నారన్నారు. ఈసారి ఎన్నికల్లో ఆయనను గెలిపించాలని ప్రజలను ఆమె కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు అరవింద్, ప్రభాకర్ రెడ్డి, సుగుణప్ప, రాధాకృష్ణప్ప, నాగరాజు, సురేష్ రెడ్డి, రాఘవేంద్ర పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ



గంటావూరులో..

పలమనేరు: పట్టణంలోని గంటావూరు ప్రాథమిక పాఠశాల పిల్లలకు శ్రీపురం సీతారామయ్య గురువారం నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. పిల్లలు బాగా చదివి స్కూలుకు, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్ఠలు తేవాలని ఆయన ఆకాంక్షించారు.

పుస్తకాలే నిజమైన స్నేహితులు



పలమనేరు: బాలికల గురుకుల పాఠశాలలో..

పలమనేరు : విద్యార్థులకు పుస్తకాలే నిజమైన స్నేహితులని స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు అన్నారు. పట్టణ సమీపంలోని బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు గురువారం ఆయన గ్రంథాలయ పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం ఉద్దీపనమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాసులు, హెచ్ఎం ప్రశాంతిలు పాల్గొన్నారు.

న్యాయవాదుల బైక్ ర్యాలీ

పుంగనూరు: పట్టణంలోని న్యాయవాదులు గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. న్యాయవాదుల సంఘ కార్యదర్శి ఆనందకుమార్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు నుంచి ర్యాలీ ప్రారంభించి, పురవీధుల్లో సాగారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటలింగ్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

జోరుగా హంద్రీ-నీవా కాలువ పనులు



రామకుప్పం: హంద్రీ-నీవా కాలువ పనులు మండలంలో జోరుగా సాగుతున్నాయి. కుప్పానికి హంద్రీ-నీవా కాలువ జలాలను తీసుకువచ్చే దిశగా రాజుపేట సమీపంలో కాలువల్లో మట్టి పనులు చేస్తున్నారు. ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ, కుప్పం ప్రజల సుదీర్ఘ కలను సాకారం చేస్తూ జనవరిలో హంద్రీ-నీవా ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి,మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రత్యేక చొరవతో కుప్పం కల సాకారం అవుతోందన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ



ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పెద్దపంజాణి: స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని చిత్తూరు జెడ్పీ చైర్మన్ జి. శ్రీనివాసులు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, సచివాలయ సిబ్బంది ఆన్‌లైన్ హాజరు పట్టికలను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ సమయ పాలన పాటించాలని, ప్రభుత్వ పథకాల ఫలాలు అర్హుల దరికి చేర్చాలని ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసి, చెల్లింపుల బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పూర్తి చేసిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ అబ్దుల్‌రహీంను ఆదేశించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బాగారెడ్డి, ఈఓపీఆర్డీ శారదాదేవి తదితరులు పాల్గొన్నారు.



పెద్దపంజాణి : పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ లక్ష్మి

కోగిలేరు సచివాలయాన్ని డీపీఓ..

పెద్దపంజాణి: మండలంలోని కోగిలేరు సచివాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి గురువారం తనిఖీ చేశారు. రికార్డులను, సిబ్బంది హాజరు పట్టికను, ఆ తర్వాత కోగిలేరు, పెద్దపంజాణి, రాయలపేట పంచాయతీ కేంద్రాల్లోని డంపింగ్ యార్డును పరిశీలించారు. గ్రామ పంచాయతీల్లో తడి, పొడి చెత్త సేకరణను వేరు చేసి, వర్మీ కంపోస్టును తయారు చేసి, గ్రామ పంచాయతీకి ఆదాయం వచ్చేలా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాలలో సర్పంచులు రమేష్‌బాబు, అరుణ, అఖిల, ఈఓపీఆర్డీ శారదాదేవి, పీఎస్‌లు మహేశ్వర్, గణపతి, సుబ్రమణ్యం, ఎంఆర్‌సీ సుధాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



బుసిరెడ్డిగారిపల్లెలో డ్రోన్‌తో ఎరువుల పిచికారీని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

రొంపిచెర్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి కోరారు. గురువారం మండలంలోని బుసిరెడ్డిగారిపల్లె, బండకిందపల్లెలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామసభలు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై మొబైల్ వాహనంలో ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఎంపీపీ తెలిపారు. డ్రోన్‌తో 20 నిమిషాల్లో రెండు ఎకరాల పంటకు పిచికారీ చేయవచ్చని, రూ.12 లక్షల విలువ చేసే డ్రోన్ 50 శాతం సబ్సిడీతో రూ.6 లక్షలకే ప్రభుత్వం మంజూరు చేస్తుందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, ఎంపీడీఓ రాజేంద్ర, సర్పంచ్ సుధారాణి, మాజీ సర్పంచులు రవీంద్ర, రామనారాయణ రెడ్డి, అమరనాథరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్లు, డైరీల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు, యూటీఎఫ్ నాయకులు

బైరెడ్డిపల్లె: స్థానిక జెడ్పీ హైస్కూలు ఆవరణలో గురువారం నూతన సంవత్సర యూటీఎఫ్ క్యాలెండర్లు, డైరీలను ఎంఈఓలు సాయిలీల, సుబ్రమణ్యం ఆవిష్కరించారు. హెచ్ఎంలు విశ్వనాథయ్య, గౌరవ్ సుల్తానా, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ప్రకాష్, సీపీఎస్ జిల్లా కన్వీనర్ శశికుమార్, యూటీఎఫ్ మండల అధ్యక్షులు రాజేష్, ప్రధాన కార్యదర్శి మోహన్, ట్రెజరర్ శరవణన్, మహిళా కమిటీ కన్వీనర్ లావణ్య, సభ్యులు గౌస్‌బాషా, షణ్ముగం, హేమలత, గణేష్, ఆంజప్ప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష పుష్పార్చన



కుప్పం పట్టణం హెచ్‌పీ రోడ్డులోని శ్రీ షిర్డీ సాయిబాబా దేవాలయంలో గురువారం లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజల అనంతరం ఈ కార్యక్రమాన్ని వేదపండితులు భక్త జన సందోహం నడుమ నిర్వహించారు. - కుప్పం రూరల్

క్రీడోత్సాహం

-'ఆడుదాం ఆంధ్రా'లో ఉరకలేస్తున్న క్రీడాకారులు

పుంగనూరు: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం యువతకు కొత్త ఊపునిచ్చింది. గ్రామీణ యువకులు క్రీడల్లో తమ సత్తా చాటేందుకు ఉత్సాహం చూపుతున్నారు. గురువారం మున్సిపాలిటీలో కమిషనర్ నరసింహప్రసాద్, చైర్మన్ అలీమ్‌బాషా, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము కలసి కబడ్డీ పోటీల క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. అలాగే మండలంలోని నేతిగుట్లపల్లెలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ నారాయణ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ పట్టణాధ్యక్షుడు జయరాం, కౌన్సిలర్లు నరసింహులు, రామకృష్ణంరాజు, సచివాలయ కన్వీనర్ వరదారెడ్డి , సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సోమలలో..

సోమల: ఆడుదాం ఆంధ్రా.. గ్రామాలలో క్రీడా స్ఫూర్తిని నింపడానికి, శారీరక, మానసిక వికాసానికి దోహదం చేస్తుందని సింగిల్‌విండో వైస్ చైర్మన్ గణపతి అన్నారు.గురువారం మండలంలోని పెద్ద ఉప్పరపల్లె సచివాలయ పరిధిలో బ్యాడ్మింటన్ పోటీలలో గెలుపొందిన జట్టుకు బహుమతులు ప్రదానం చేసి ఆయన మాట్లాడారు. అలాగే కందూరు సచివాలయ పరిధిలో నిర్వహించిన వాలీబాల్ పోటీలలో జూనియర్స్ జట్టు విజయం సాధించినట్టు సర్పంచ్ మసూద్, సచివాలయ కన్వీనర్ పగడాల శివకుమార్ తెలిపారు. కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు మసుదా బేగం, జైశంకర్, పీడీలు చిన్నబ్బ, మల్లీశ్వరి పాల్గొన్నారు.

పులిచెర్లలో వాలీబాల్ పోటీలు

పులిచెర్ల(కల్లూరు): మండల కేంద్రమైన పులిచెర్ల హైస్కూల్లో గురువారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు సంబంధించి వాలీబాల్ పోటీలను స్థానిక సర్పంచ్ రాజెమ్మ ప్రారంభించారు. ఎంపీడీఓ రాజశేఖర్, ఎంఈఓలు సిద్ధరామయ్య, తాతయ్య, నాయకులు ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత నగిరి దళితవాడ

రొంపిచెర్ల: మండలంలోని బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా వాలీబాల్ పోటీలలో నగిరి దళితవాడ జట్టు విజేతగా నిలిచిందని ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు. గురువారం పురుషులకు, మహిళలకు వేర్వేరుగా ఈ పోటీలు నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ఆటల పోటీలకు సంబంధించి క్రీడాకారులకు అన్ని వసతులను కల్పించినట్టు ఎంపీడీఓ చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు కోటా వెంకటరమణ, కార్యదర్శి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

టి.వడ్డూరులో..

పలమనేరు: మండలంలోని టి.వడ్డూరు పంచాయతీలో వాలీబాల్ పోటీలను గురువారం సర్పంచ్ మునస్వామి ప్రారంభించారు. పంచాయతీ స్థాయిలో విజేతగా నిలిచిన జట్టు మండల స్థాయి పోటీలకు ఎంపికవుతుందని పంచాయతీ కార్యదర్శి బంగారం తెలిపారు.

గంగవరంలో..

గంగవరం: మండలంలోని 7 సచివాలయ పరిధిలో గురువారం క్రీడా పోటీలు నిర్వహించారు. గుండుగల్లు, తాళ్లపల్లెలో బ్యాడ్మింటన్, పత్తికొండ, కలగటూరులో క్రికెట్, కీలపట్ల, కొత్తపల్లె, మేలుమాయిలో వాలీబాల్ పోటీల్లో ఉత్సాహంగా క్రీడాకారులు పాల్గొన్నారు. మూడవ రోజు మొత్తం 14 మ్యాచ్‌లు పూర్తయినట్టు ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.



పుంగనూరు: నేతిగుట్లపల్లెలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

క్రీడాకారులకు వరం

పెద్దపంజాణి: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు గ్రామీణ క్రీడాకారులకు ఒక వరం లాంటివని ఎంపీపీ ఎస్. రెడ్డెప్ప అన్నారు. చామనేరు, అమ్మరాజుపల్లె, పెద్దవెలగటూరు, చలమంగళం సచివాలయ పరిధిలో గురువారం క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాగారెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్ రహీం, ఎంఈఓలు గోపాల్ రెడ్డి, తులసీరాం, ఈఓపీఆర్‌ఆర్డీ శారదాదేవి, జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, నాయకులు లతీష్, సన్నపరెడ్డి, షఫీవుల్లా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ...కబడ్డీ

బైరెడ్డిపల్లె: 'ఆడుదాం-ఆంధ్రా' క్రీడా పోటీల్లో భాగంగా గురువారం కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. 10 సచివాలయాల్లో ఈ పోటీలు నిర్వహించారు. గ్రామీణ క్రీడాకారులు ఉత్సాహంగా ఈ పోటీల్లో తలపడ్డారు. ఎంపీడీఓ రాజేంద్రబాలాజి, తహసీల్దార్ కుమారస్వామి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పలమనేరు : టి.వడ్డూరులో..



పెద్దపంజాణి : ఆటవస్తువులను అందజేస్తున్న ఎంపీపీ









సోమల: పెద్ద ఉప్పరపల్లెలో బ్యాడ్మింటన్ విజేతలను అభినందిస్తున్న గణపతి, పులిచెర్లలో..., రొంపిచెర్ల : బొమ్మయ్యగారిపల్లెలో వాలీబాల్ పోటీలు ఆడుతున్న బాలికలు, బైరెడ్డిపల్లె: కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు